సాక్షి సూర్యాపేట

శనివారం । 28 । జనవరి । 2023



కొత్త వంగడాల సాగుకు..

కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలని కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్ అన్నారు.

- 8లో



ఆర్టీసీకి పునాది రాళ్లు కార్మికులే..

ఆర్టీసీకి పునాది రాళ్లు కార్మికులేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం
33°/19°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



దాణా అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస రావు, జెడ్పీటీసీ చంద్రకళ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం కిష్టాపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ చింతారెడ్డి చంద్రకళతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో కూడా పశువైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా పశువులకు రోగ నిర్ధారణ చేసి మందులు, దాణా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యులు, సిబ్బంది, పశు పోషకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రాం జిల్లా క్వాలిటీ మేనేజర్ నాగమణి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం జిల్లా క్వాలిటీ మేనేజర్ డాక్టర్ నాగమణి పరిశీలించారు. అందరికీ కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి అద్దాలు, మందులు ఇస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్ఓ ఎల్. చరణ్, ఆప్తమాలజిస్ట్ వేణు, ఏఎన్ఎంలు సైదమ్మ, శకుంతల, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అవార్డ్స్ థీమ్స్ రికార్డుల పరిశీలన




పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న సీఈఓ

కోదాడరూరల్ : మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామాన్ని జెడ్పీ సీఈఓ సురేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ అవార్డ్స్ థీమ్స్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పల్లెప్రకృతి వనం, డంపింగ్ యార్డు, కంపోస్టు ఎరువుల తయారీ విధానం, శ్మశానవాటిక నిర్వాహణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఫారెస్ట్ అధికారి సతీష్, సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, కార్యదర్శి నాగలక్ష్మి ఉన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

మోతె : నేషనల్ పంచాయతీ అవార్డు ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మోతె మండలంలోని తుమ్మలపల్లి గ్రామాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ సురేష్, డీఎఫ్ఓ సతీష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, ఎవెన్యూ ప్లాంటేషన్, సెగ్రిగేషన్ షెడ్, అంతర్గత రోడ్లు, మరగుదొడ్లు, ఇంకుడు గుంతలు పరిశీలించారు. వీరి వెంట ఎంపీఓ హరిసింగ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో స్వామి వారి నిత్యకల్యాణంలో భాగంగా శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం, మాంగళ్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లి రావు, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ జనసంద్రం

- వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం
- సైదన్న నామస్మరణతో మార్మోగిన దర్గా పరిసరాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు
- లక్షకుపైగా తరలివచ్చిన భక్తులు



జాన్‌పహాడ్ దర్గా

పాలకవీడు : జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు రెండో రోజు శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంధానికి చందల్‌ఖానాలో ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, వక్ఫ్‌బోర్డు పెద్దలు గంధం కలశాన్ని ఎత్తుకుని ఊరేగింపును ప్రారంభించారు. కుటుంబ సమేతంగా కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ దర్గాను సందర్శించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై పవిత్ర గంధాన్ని గ్రామ పురవీధుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రత్యేక పోలీసు బలగాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం దర్గాకు తీసుకుచ్చారు. గంధాన్ని దర్గాలోకి తీసుకొచ్చి సైదులు బాబా సమాధులపై పెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలోకి గంధాన్ని తీసుకొచ్చే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో ఉండడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై లక్షకు పైగా భక్తులు దర్గాను సందర్శించారు. దర్గా సమీపంలో ఉన్న నాగుల పుట్ట వద్ద మహిళలు పాలు, పండ్లు, గుడ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆర్డీఓ వెంకారెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ముసిల్లాఖాన్, సీఈఓ ఖాజామొహినుద్దీన్, దర్గా ఇన్‌స్పెక్టర్ మహమూద్, బాబా, ఫిరోజ్



గంధం మోసుకెళ్తున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఇతర అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో..

ఉర్సుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో భక్తులకు సౌకర్యం కల్పించారు. ఆయాశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. గంధోత్సవం సందర్భంగా దాదాపు 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వివిధ సేవా కార్యక్రమాలు..

భక్తుల సౌకర్యార్థం డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వారు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతో దర్గా పరిసరాల్లో రోడ్లపై దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని చల్లించారు. అలాగే తాత్కాలిక మరుగుదొడ్లు, ఉర్సులో భాగంగా హాజరైన పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. చెరువుతండాకు చెందిన బాణోత్ రాంబాబు ఉర్సు సందర్భంగా అన్నదానం, తాగునీరు అందించారు.



నాగుల్‌మీరా పుట్ట వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



దర్గా వద్ద కిక్కిరిసిన భక్తులు

కాలువల నిర్మాణంలో గత పాలకుల నిర్లక్ష్యం

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



ఎస్సారెస్పీ కాలువను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : కాలువల నిర్మాణంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రైతులు ఇబ్బందులు తెలుసుకున్న మంత్రి శుక్రవారం రాత్రి చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామం నుంచి బీబీగూడెం గ్రామ శివారులోని సూర్యాపేట- ఖమ్మం రోడ్డు వరకు ఉన్న ఎస్సారెస్పీ కాలువను పరిశీలించి మాట్లాడారు. గత పాలకులకు ఎక్కడ తూములు, డ్రాప్‌ల నిర్మాణం చేపట్టాలో తెలియకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామానికి నీరు వెళ్లడానికి డ్రాప్ నిర్మించాలని ఆదేశించారు. ఇక్కడ డ్రాప్ ఏర్పాటు చేయడం వల్ల మండలంలో వెయ్యి ఎకరాలు సాగయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఖమ్మం సూర్యాపేట రహదారి నుంచి ఎస్సారెస్పీ కాలువ మీదుగా ఖాసీంపేట గ్రామం వరకు నూతన రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, సర్పంచ్‌లు ఉన్నారు.

అధికార పార్టీ తొత్తులుగా మారిన పోలీసులు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు : రాష్ట్రంలో పోలీసులు అధికార బీఆర్‌ఎస్ పార్టీ కనుసన్నల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారని మాజీ టీపీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమను పోలీసులు వేధిస్తున్నారని కార్యకర్తలు తెలపడంతో ఆయన సమావేశం నుంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్టేషన్ ఎదుట మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. దీంతో కార్యకర్తలు అక్కడికి వచ్చి ఆయనకు మద్దతు తెలిపారు. సుమారు రెండు గంటల పాటు పోలీసు స్టేసన్ ఎదుట బైఠాయించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, కోదాడ రూరల్ సీఐ నాగదుర్గా ప్రసాద్, చింతలపాలెం ఎస్ఐ కృష్ణారెడ్డి, చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్‌లు అక్కడకు చేరుకొని ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

నేటి నుంచి ప్రత్యేక అకౌంట్ ఓపెనింగ్ డ్రైవ్

భానుపురి (సూర్యాపేట) : జిల్లావ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక అకౌంట్ ఓపెనింగ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సూర్యాపేట వెస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖలోని అన్ని సేవింగ్ పథకాల వడ్డీ రేట్లు జనవరి 1నుంచి భారీగా పెరిగాయని, ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పోస్టల్ వడ్డీరేట్లను సవరిస్తుందని, ఇందులో భాగంగా జనవరి 1, 2023 నుంచి మార్చి 31వ తేదీ 2023 వరకు ఉండే పోస్టల్ వడ్డీ రేట్లను భారీగా పెంచిందన్నారు. సేవింగ్ అకౌంట్ 4శాతం, రికరింగ్ డిపాజిట్ 5.8 శాతం, ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్ 6.6 శాతం, రెండేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ 6.8 శాతం, మూడేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ 6.9 శాతం, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ 7శాతం, మంత్లీ ఇన్‌కమ్ స్కీం 7.1శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ అకౌంట్ 7.1 శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్ 7.6 శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్ 8శాతం, కిసాన్ వికాస్ పత్ర 7.2శాతం, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ కింద 7 శాతం వడ్డీ లభిస్తుందని పేర్కొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కొనసాగుతున్న ప్రక్రియ
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తులు



ధ్రువపత్రాలను సమర్పిస్తున్న ఎస్జీటీలు

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. ఈమేరకు గురువారం స్కూల్ అసిస్టెంట్‌లు జీహెచ్ఎం పదోన్నతుల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తమ సర్వీస్‌కు సంబంధించి ధ్రువపత్రాలను సమర్పించారు. శుక్రవారం ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతుల కోసం ధ్రువపత్రాలు సమర్పించారు. శనివారం కూడా ఎస్జీటీల ధ్రువపత్రాలు పరిశీలన కొనసాగనుంది.

ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తులు

ఉపాధ్యాయులు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. బదిలీలు, పదోన్నతులకు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఐదేళ్లు ఒకే పాఠశాలలో పని చేసిన హెచ్ఎంలు, ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసిన ఇతర ఉపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. కనీస సర్వీస్ పూర్తి చేసుకున్న వారు బదిలీ కోసం దరఖాస్తు చేయకపోయినా విధిగా స్థాన చలనం చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 1 నాటికి ఒకే పాఠశాలలో కనీసం రెండేళ్ల పాటు పనిచేసిన వారు మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఉద్యోగ విరమణ మూడేళ్ల వయసు ఉన్న వారు కోరుకుంటేనే బదిలీ చేస్తారు.

జిల్లాలో 791 పోస్టులు ఖాళీ..

జిల్లాలో వివిధ విభాగాల్లో 791 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఉపాధ్యాయులు 4,255 పోస్టులు ఉండగా 3,464 మంది పనిచేస్తున్నారు. ఇందులో ఐదేళ్లు, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారు 1,134 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరూ ఖచ్చితంగా బదిలీ కావాల్సిందే. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు దరఖాస్తు హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆ పాఠశాల హెచ్ఎంకు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు ఎంఈఓలకు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందజేయాల్సి ఉంటుంది.

ప్రాథమికంగా ప్రారంభించాం

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రాథమికంగా ప్రారంభించాం. అర్హులకు పదోన్నతులు కల్పిస్తాం. బదిలీలు, పదోన్నతులు పూర్తిగా పారదర్శకంగా చేపడుతున్నాం. – అశోక్, డీఈఓ

ఇళ్లకు జియోట్యాగింగ్

- మున్సిపాలిటీల్లో ఆస్తుల సమగ్ర సమాచారం నిక్షిప్తానికి చర్యలు
- ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా కార్యాచరణ
- ప్రక్రియను ప్రారంభించిన యంత్రాంగం
- పూర్తి కావొచ్చిన గృహ వివరాల సేకరణ సర్వే



ఇంటి కొలతలు తీస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

హుజూర్‌నగర్: మున్సిపాలిటీలలో ఉన్న ఆస్తుల సమగ్ర సమాచారం నిక్షిప్తం చేసేందుకు ప్రభుత్వం యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను జియోట్యాగింగ్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. మున్సిపాలిటీల పరిధిలోని ఇళ్లకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే భువన్ యాప్‌లో ఇళ్ల నమోదు ప్రక్రియ రెండేళ్లుగా కొనసాగుతూనే ఉంది. అయితే పలు సాంకేతిక కారణాల వల్ల వివరాల నమోదు నెమ్మదించిందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇళ్ల, భవనాల జియోట్యాగింగ్ చేసే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా..

భువన్ యాప్‌లో ప్రతి ఇంటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయి. యజమానికి సంబంధించి ఆస్తుల సమాచారం సక్రమంగా ఉందో లేదో ఆరా తీయనున్నారు. సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు భవనాల ముదింపు, అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సెల్‌ఫోన్‌లో చిత్రాలు తీసి పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. ఇంటి నంబర్లులేని గృహాలు, భవన విస్తీర్ణం, సర్కారు భవనం వంటి ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని వాటిని నమోదు చేయనున్నారు. వాణిజ్య భవనాల వివరాలు, నల్లా కనెక్షన్లు, సెల్ టవర్లు, వ్యాపార ధ్రువీకరణ అనుమతులు తదితరాలు అందులో ఉంటాయి.

ఆన్‌లైన్ నమోదు వేగవంతం..

కోవిడ్ సమయంలోనే మున్సిపాలిటీల్లో సిబ్బంది ఇంటింటికీ వచ్చి సర్వే చేసి వివరాలను ఆన్‌లైన్ చేశారు. అయితే వివిధ కారణాల వల్ల సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ఆగింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించడంతో మున్సిపల్ సిబ్బంది మళ్లీ ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేశారు. ప్రస్తుతం ఇళ్ల నమోదు ద్వారా సమాచారాన్ని అంతా ఒకేచోట క్రోడీకరిస్తారు. ప్రతి ఇంటికి కొలతలు తీస్తారు. ముదింపు పరిధిలోని ఆయా ఆస్తులను జియోట్యాగింగ్ చేయనున్నారు. ఇప్పటికే భవనాల కొలతల్లో తప్పులు జరిగి ఉంటే ప్రస్తుతం తీసే కొలతల్లో వాటిని సర్దుబాటు చేయనున్నారు. ప్రస్తుతం తీసుకునే కొలతల ఆధారంగా వచ్చే ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను కొంత వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

చివరి దశలో వివరాల సేకరణ సర్వే..

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలోని ఇళ్ల వివరాల సేకరణకు చేపట్టి సర్వే తుది దశకు చేరింది. ఒక మున్సిపాలిటీలో వంద శాతం పూర్తిగాగా మిగతా చోట్ల 65శాతం నుంచి 95శాతం పూర్తయింది. సూర్యాపేట మున్సిపాలిటీలో 32,062 ఇళ్లు ఉండగా 65శాతం సర్వే పూర్తయింది. కోదాడలో 16,282 ఇళ్లు ఉండగా 95 శాతం సర్వే పూర్తి చేశారు. హుజూర్‌నగర్‌లో 7,407 ఇళ్లు ఉండగా 92 శాతం పూర్తయింది. నేరేడుచర్లలో 4,262 ఇళ్లు ఉండగా 50 శాతం, తిరుమలగిరిలో నూరు శాతం పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు




మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లకు జియోట్యాగింగ్ చేసే చర్యల్లో భాగంగా కోసం సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తి చేశాం. మున్సిపల్ సిబ్బంది ప్రతి ఇంటిని ఫొటోలు తీసి పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొసాగుతోంది. గతంలో కొలతల ఆధారంగా ఉన్న ఆస్తిపన్నులో వ్యత్యాసాలు కూడా దీంతో సరి అవుతాయి. ఇక నుంచి అంతా పారదర్శకంగా ఉంటుంది.

– కె.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

బదిలీలు పారదర్శకంగా చేపడతాం

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మనఊరు– మన బడి, ఉపాధ్యాయుల బదిలీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి ఆదేశాలతో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అవినీతికి తావు లేకుండా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మనఊరు– మన బడి కింద 950 పాఠశాలలు ఎంపిక కాగా అందులో మొదట విడతలో 329 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. 36 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీలు 791 ఉన్నాయన్నారు. 5 నుంచి 8 సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్న టీచర్లు 1,134 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో 1,925 మంది టీచర్లకు బదిలీ, పదోన్నతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల కోసం సీనియారిటీ, ఖాళీల జాబితా ఇప్పటికే సమర్పించామని వివరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కోఆర్డినేటర్లు శ్రవణ్ కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెరువుగట్టు బ్రహ్మోత్సవాలు


నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టులో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



- వివరాలు 8లో

ఈ- శ్రమ్ కార్డుల నమోదులో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈ- శ్రమ్ కార్డులు అందించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ నమోదుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 3,70,496 మందికి ఈ శ్రమ్ కార్డులు అందించే లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,17,675 మంది కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు అందించామని తెలిపారు. రాష్ట్రంలో 16 స్థానంలో సూర్యాపేట జిల్లా ఉందని, ఈ నమోదు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని సూచించారు. ఆదాయపు పన్ను పరిధిలోకి రాని 16 నుంచి 59 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్డు ద్వారా ప్రతి కార్మికుడికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్య బీమా ఉచితంగా కల్పించబడుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కార్మికుడికి ఉచితంగా కార్డులు అందించాలన్నారు. కార్డు పొందిన ప్రతి కార్మికుడు ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు సులువుగా పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు. ఆటో మొబైల్, రవాణా రంగం, చేతి వృత్తులు, స్వయం ఉపాధి, ప్రభుత్వ పథకాలు అమలు కాని వారు, హమాలీలు, దుకాణాలు అలాగే వివిధ సంస్థల్లో పనిచేసే వారు అర్హులన్నారు. సమావేశంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మంజుల, కార్మిక శాఖ అధికారి రాజు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ యకులు

భువనగిరి : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్‌కు కేంద్రం పెంచిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల ఏరియార్స్‌తో పాటు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం సీడీపీఓ స్వరాజ్యానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి చిలువేరు రమాకుమారి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశం, నాయకులు ప్రమీల, షాహెద, రుక్మిణి, వరమ్మ, వసంత, రాధిక, హేమలత, నాగమణి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అక్కడ కొనసాగుతున్న ఏర్పాట్లను శుక్రవారం నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గట్టుపైన, కింద వివిధ ప్రదేశాలతోపాటు కల్యాణ మండపం, కోనేరు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి ఏర్పాట్లను చూసి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తుల అవసరాలకు తగ్గట్టుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీబుద్దీన్, దేవాదాయ శాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ అధికారి నవీన్‌కుమార్, సర్పంచ్ మాల్గ బాలకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ యాదగిరి, ఎస్‌ఐ రామకృష్ణ, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



చెర్వుగట్టు పైకి వెళ్లే ప్రధాన ద్వారం



చెర్వుగట్టు దేవాలయం

రామలింగేశ్వరుడి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- 29న స్వామివారి కల్యాణం
- ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న చెర్వుగట్టు
- దక్షిణ తెలంగాణ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


నార్కట్‌పల్లి : ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాలకు వేళైంది. శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చెరువుగట్టు కొండపై వెలిసిన రామలింగ్వేరుడు భక్తజన బాంధవుడిగా వెలుగొందితున్నాడు. స్వామి వారు జడల ఆకృతిని పోలి ఉండటంతో జడల రామలింగేశ్వరుడిగా పిలువబడుతున్నారు.



శివుని విగ్రహం

బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు

దేవాలయంలో ప్రధాన మండపంలో ప్రజాప్రతినిధుల గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు. 28న ఉత్సవాల ప్రారంభానికి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారు. ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలను పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ మరో 20 మంది అర్చక బృందం ప్రారంభిస్తారు. 29వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కల్యాణ మండపంనందు స్వామివారి కల్యాణం జరుగుతుంది. అదే రోజు రాత్రి కోనేరులో తెప్పోత్సవం, 30వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాలు, 31వ తేదీ తెల్లవారు జామున దోపోత్సవము, సాయంత్రం ఏకాంతసేవ, ఫిబ్రవరి 1న ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, 2న సాయంత్రం గజవాహనముపై స్వామి, అమ్మవార్ల, చెరువుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగింపు జరుగుతుంది. స్వామి వారి కల్యాణ్యాన్ని భక్తులందరూ తిలకించేందుకు ప్రత్యేకంగా 6 ప్రొజెక్టర్ స్క్రీన్లను కొండ పైన, కింద ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన కింద ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పారిశుధ్యం మెరుగునకు తగిన సిబ్బందిని నియమించారు. డీఎల్‌పీఓ లక్ష్మీ నారయణ, ఎంపీడీఓ యాదగిరి పర్యవేక్షణ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శికిరణ్‌కుమార్ తెలిపారు. గట్టుపైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు,



మూడు గుండ్ల ప్రాంతం

ప్రత్యేక పార్కింగ్

నార్కట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో, ఎల్లారెడ్డిగూడె నుంచి వచ్చేవారికి దారిలో, ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గామ శివారులో ప్రత్యేకంగా పార్కింగ్ వసతి ఏర్పటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగుడ, దేవరకోండ డిపో నుంచి బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి 5నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డీనరి సర్వీసు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు తెలిపారు.

అమావాస్య ప్రత్యేకత

ప్రతి నెల అమావాస్యకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి దేవస్థానానికి లక్షల కొలది సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ఆ రాత్రి అక్కడే నిద్రచేస్తారు. మరుసటిరోజు స్వామిని దర్శించుకొని వెళ్లడం ఆచారంగా కొన్నసాగుతుంది.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం, భక్తులకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, సౌకార్యలు కల్పించేందుకు 8 జోన్‌లు ఏర్పాటు చేశాం. జోన్‌కు జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. విద్యుత్ సమస్య పరిష్కారానికి గట్టు పై 100 కేవీ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నాం.

– జయచంద్రారెడ్డి, ఆర్డీఓ

ఆరు రోజుల పాటు ఉత్సవాలు



శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సావాలుకి ఆర్డీఓ జయచంద్రరెడ్డి , డీఎస్పీ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో జరగనున్నాయి. బ్రహ్మత్సవాల గురించి ప్రజలకు తెలియ జేయడానికి గాను జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా ప్రచారం చేస్తున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు సిబ్బందిని నియమించాం. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం, మరుగు దొడ్లు ఏర్పాటు చేయించాం. భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త కుండీలను వినియోగించుకుని సహకరించాలి.

– బాలకృష్ణ, చెర్వుగట్టు సర్పంచ్

కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలి

మోతె: కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలని కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, కిరణ్ రైతులకు సూచించారు. శుక్రవారం మోతె మండల పరిధిలో రావిపహాడ్ క్లస్టర్ రైతు వేదికలో జరిగిన శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపెల్లి వారి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం పప్పు దినుసుల పెసర పంటల సామూహిక ప్రదర్శన క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకం మూలాన ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రతి రైతు జీవన,సేంద్రియ ఎరువులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.అనంతరం రైతులకు జీవ



రైతులకు పెసర విత్తనాలు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కార్తిక్, రైతులు మల్లారావు, మధుసూదన్‌రెడ్డి, హేమేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

త్రిపురారం : వ్యవసాయంలో ఒక్క పంటలపైనే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెడ్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం త్రిపురారంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వ్యవసాయ క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పెంచుతున్న కోళ్లు, గొర్రల పెంపకాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా కోళ్లు, గొర్రెలకు అందించే దానా గడ్డి రకాలు ఆదాయంపై వివరాలు అడిగి తెలుసున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, బాబుసాయి పేట సర్పంచ్ శ్రవణ్



షెడ్డులో పెంచుతున్న గొర్రెలను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

కుమార్, డైరెక్టర్ నాగరాజు, అనిల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అధితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట ఆందోళన

నార్కట్‌పల్లి : వైద్య కళాశాల యాజమాన్యం తమ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ శుక్రవారం నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ నార్కట్‌పల్లి వైద్య కళాశాలలో చదువుతున్న నాల్గో సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 21వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయని, అర్ధరాత్రి సమయంలో పరీక్ష ఫీజుల లింకును కల్పించడం విడ్డురంగా ఉందన్నారు. పరీక్ష ఫీజులను కట్టేందుకు అనుమతించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ మాట్లాడేందుకు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులకు అటెండెన్స్ ఉన్నప్పటికీ కళాశాల యాజమాన్యం పరీక్షలు రాసేందుకు ఎందుకు అనుమతించడం లేదని అన్నారు. 150 మంది విద్యార్థులకు పరీక్షలకు అనుమతించకపోవడం దారుణమన్నారు.

జంతు హింసను నివారించాలి

నల్లగొండ అగ్రికల్చర్ : జంతు హింసను నివారించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంబటి యాదగిరి పిలుపునిచ్చారు. జంతు హింస నివారణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్పీ రోడ్డు, గడియారం సెంటర్, ప్రకాశం బజార్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు.

అధునాతన పద్ధతిలో మెట్ట వరిసాగు

మిర్యాలగూడ: డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన పద్ధతిలో మెట్ట వరి సాగును మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలోని కట్టా దామోదర్‌రెడ్డి పొలంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ యూరియా, పొటాష్, అడుగుపిండి కలిపి తయారు చేసిన గుళికలను మెట్టసాగు పద్ధతిలో సుమారు 8 నుంచి 10 అంగుళాల భూమిలో వేయడంతోపాటు పై భాగంలో మూడు అంగుళాల్లో విత్తనాలు వేశారు. దీంతో భూమిలో పెట్టిన గుళికలు ద్వారా మొక్కకు సరిపడ పోషకాలు అంది మంచి దిగుబడులు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ



మెట్ట వరి సాగుపై అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

ఫెసిలిటర్ సబ్బుసింగ్, రమేష్, రైతులు జెర్రిపోతుల వెంకన్న, చింతపల్లి సీతారాములు, కొడదల సైదులు, ఇండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పండుగ వాతావరణంలో రాయాలి



విద్యార్థులతో పీవీ శ్యాంసుందర్‌రావు

భువనగిరి : విద్యార్థులు పరీక్షలను భయంతో కాకుండా పండుగ వాతావరణంలో రాయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక జీనియస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు అంటే ఒత్తిడి, భయానికి లోనుకాకుండా ఉండే విధంగా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పర్వతారోహికురాలు అన్వితారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాసన్న, పాశం భాస్కర్,రవీందర్, శ్రీనివాస్, నర్ల నర్సింగ్‌రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు

నడిగూడెం : పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఆదర్శ రైతు దంపతులు వాసికర్ల శేషకుమార్, లక్ష్మీప్రియ తెలిపారు. శుక్రవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సమీకృత వ్యవసాయ చేస్తున్న వాసికర్ల శేషకుమార్ వ్యవసాయ క్షేత్రాన్ని నాబార్డు సహకారంతో నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి మహిళా రైతులు క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆ దంపతులు మాట్లాడారు. తక్కువ భూమిలో అధిక పంటలు సాగు చేయవచ్చని, అలాగే నిత్యం ఆదాయం ఉండాలంటే సమీకృత వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్, పలు సేంద్రియ పద్ధతులు, ద్రావణాల తయారీ, పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 40 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరి : భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీడబ్ల్యూ, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు రాములు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ. 54 వేల క్లెయిమ్స్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. లేబర్ ఆఫీస్‌లో ఖాళీలను భర్తీచేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, నర్సింహ్మా, శ్రీనివాస్, రామచంద్రం, మైసయ్య, అమరేందర్, మారయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం

ఆత్మకూరు(ఎం): రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం చేస్తుందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొరటికల్‌లో రైతు దూసరి రాజు వ్యవసాయ



మొక్కనాటుతున్న రామకృష్ణారెడ్డి

భూమిలో ఆయిల్ పాం మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయిల్ పాం సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారని చెప్పారు. జిల్లాలో నాలుగు వేల ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఒక వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. దేశంలో వంట నూనెల కొరత అధిగమించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల ఎకారాల్లో సాగు చేయాలన్నదే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 జిల్లాల్లో 1.20లక్షల ఎకరాల్లో ప్రస్తుతం ఆయిల్ పాం సాగు చేస్తున్నామని తెలిపారు. పత్తికి, వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పాం సాగుకు రైతులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల సత్తయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ఆత్మ రాష్ట్ర డైరెక్టర్ సోలిపురం అరుణాఉపేందర్‌రెడ్డి, డీసీఓ ప్రవీణ్, ఏఈఓ వి.కీర్తన, ఫీల్డ్ ఆఫీసర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మేధాశక్తి అధికం

యాదగిరిగుట్ట రూరల్: క్రీడాకారులకు మేధాశక్తి అధికంగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో కేసరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్



కబడ్డీ ఆడుతున్న ప్రభుత్వ విప్

బ్యాడ్మింటన్ పోటీలను డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు చాలా ముఖ్యమని అన్నారు. అనంతరం కబడ్డీ ఆటలను ప్రభుత్వ విప్ ఆడి జిల్లాలోని కూనూర్, వంగపల్లి జట్ల మధ్య ఆటలను టాస్ వేసి ప్రారంభించారు. కాగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి కబడ్డీ ఆటను ఆడడానికి 20 జట్లు, బాల్ బ్యాడ్మింటన్ ఆటలు ఆడడానికి 20 జట్లు వచ్చాయని కేసరి యూత్ అధ్యక్షులు రేగు బాల్‌నర్సయ్య తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ కానుగు కవిత బాలరాజ్ గౌడ్, ఉపసర్పంచ్ రేపాక స్వామి, కేసరి యూత్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, జిల్లా కబడ్డీ ట్రెజరర్ కుమార్, యాత్ర స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సురుపంగ శివలింగం, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఎస్ఎమ్‌సీ చైర్మన్ అంజనేయులు, మదర్ డైరీ చైర్మన్ క్లాపల్లి శ్రీశైలం మహేంద్ర యువసేన అధ్యక్షులు ఎండీ అజ్జు పాల్గొన్నారు.

వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం



పాటలు పాడుతున్న ఖవ్వాలీ బృందం



ఆరుబయట భోజనాలు చేస్తున్న భక్తులు



జాన్‌పహాడ్ దర్గాలో కలెక్టర్, ఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రార్థనలు



దర్గా వద్ద కిక్కిరిసిన భక్తులు



దర్గాలో భక్తుల కోలాహలం





మొక్కు చెల్లించేందుకు వస్తున్న భక్తురాలు, పార్కింగ్ స్థలంలో నిలిచిన వాహనాలు



కృష్ణానది వద్ద పర్యాటకుల సందడి



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు